క్లుప్తంగా

నలుగురికి సీఎంఆర్ఎఫ్ మంజూరు

మైలవరం: మైలవరం నియోజకవర్గంలో నలుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.4.75 లక్షలను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మంజూరు చే యించారని ఎమ్మెల్యే కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. మైలవరం మండలం వెల్వడం గ్రామానికి చెందిన శీలం పద్మావతికి రూ.1.40 లక్షలు, వెల్వడంకు చెందిన కొణతం జమలయ్యకు రూ.1.40 లక్షలు, జి.కొండూరు మండలం వెలగలేరు గ్రామానికి చెందిన అరవపల్లి వెంకటేశ్వరరావుకు రూ.65 వేలు, విజయవాడ రూరల్ మండలం జక్కంపూడికి చెందిన బోడేపూడి బసవయ్యకు రూ.1.30 లక్షలు మంజూరయ్యాయని వివరించారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

మైలవరం: మైలవరం మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో ట్రస్ట్ కార్యాలయంలో పేదలు, వృద్ధులు, వితంతువులకు బుధవారం బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ మాట్లాడుతూ ఆకలితో ఉన్న వృద్ధులు, వితంతువులకు మూడు నెలలకు సరిపడా సరుకులు అందజేశామన్నారు.

ఎస్ఐల బదిలీ

తిరువూరు: తిరువూరు పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్లను బదిలీచేస్తూ ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. తిరువూరు సెక్టార్-1 ఎస్ఐ సతీష్‌ను చిల్లకల్లుకు, సెక్టార్-2 ఎస్ఐ పద్మారావును జగ్గయ్యపేట-2 స్టేషన్‌కు బదిలీ చేశారు. సూర్యారావుపేట క్రైం పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కేవీజీవీ సత్యనారాయణ, సీఎస్‌బీ నుంచి జీవీవీ సత్యనారాయణను తిరువూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో అజయ్ ప్రతిభ



తిరువూరు: ఎన్టీఆర్ జిల్లా స్థాయిలో ఇటీవల తిరువూరులో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ 2024 పోటీల్లో స్థానిక శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి కె. అజయ్ ప్రథమస్థానంలో నిలిచారు. 89 కిలోల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో అజయ్ బంగారు పతకం సాధించాడని కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు తెలిపారు. విద్యార్థి అజయ్‌ను కళాశాల యాజమాన్యం అభినందించింది.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మైలవరం: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రయాణ సమయంలో ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి విలువైన జీవితాలు కాపాడుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సేఫ్ డ్రైవింగ్ అండ్ సేఫ్ లైఫ్స్ అంశంపై విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ ప్రభుత్వ రోడ్డు సేఫ్టీ కమిటీ సభ్యుడు వాసు మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరమని, మద్య పానం చేయరాదని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడరాదని, సీట్ బెల్ట్ పెట్టుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి. హరిశివప్రసాద్, అధ్యాపకులు ఎస్. ఉమామహేశ్వరరెడ్డి, ట్రాన్స్‌పోర్టు ఇన్చార్జి డాక్టర్ కె.దిలీప్‌కుమార్, ఎన్ఎస్ఎస్ విభాగపు ఇన్‌చార్జ్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నాగరాజు

మైలవరం: బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా మైలవరం మండలం పొందుగల గ్రామానికి చెందిన ఆరేపల్లి నాగరాజు నియమితులయ్యారని మైలవరం నియోజకవర్గ పార్టీ కో-కన్వీనర్ పి.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగరాజుకు నియామక పత్రాన్ని రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ అందజేశారని చెప్పారు.

హుండీ కానుకల చోరీ కేసులో నిందితుడికి జైలు

తిరువూరు: ఏకొండూరు మండలం రామచంద్రాపురంలో 2023 నవంబరు 20న దేవాలయ హుండీ పగులగొట్టి కానుకల చోరీకి పాల్పడిన నిందితుడికి తిరువూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ మోతీలాల్ 73 రోజుల జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. విజయ వాడ భవానీపురానికి చెందిన కాటూరి నరేష్ ఈ చోరీకి పాల్పడగా.. పోలీసులు నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం నిందితుడికి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని ఇన్‌చార్జి ఎస్ఐ పద్మారావు తెలిపారు.

ఆస్పత్రి వద్ద ఆందోళన

నూజివీడు: స్థానిక హనుమాన్ జంక్షన్ రోడ్డులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం వికటించడం వల్ల తమ కుమారుడు వేమూరి యశ్వంత్ శ్రీరామ్ (11) మృతి చెందాడంటూ కుటుంబ సభ్యులు, వారి బంధుమిత్రులు బుధవారం రాత్రి ఆందోళనకు దిగారు. కాలు నొప్పితో మంగళవారం ఆస్పత్రికి వెళ్లితే ఇంజక్షన్ చేశారని, తరువాతి రోజుకే బాలుడు నల్లగా మారి మృతిచెందాడని వారు ఆరోపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపు చేశారు. ఇరువర్గాలతో చర్చించి రాజీ చేశారు.

ఆసరాతో మహిళల ఆర్థిక ప్రగతి

- స్వామిదాసు, ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు
- ఆసరా చెక్కు పంపిణీ



తిరువూరులో మహిళలకు ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న నల్లగట్ల స్వామిదాసు

తిరువూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాల మంజూరులో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం స్థానిక షాదీఖానాలో బుధవారం జరిగింది. తిరువూరు నగర పంచాయతీ పరిధిలో రూ.3.90 కోట్ల మేర ఆసరా పథకం నమూనా చెక్కును మహిళలకు అందజేశారు. స్వామిదాసు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు, పేదరిక నిర్మూలనకు ప్రవేశపెడుతున్న పలు పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చంద్రబాబు డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చక పోవడంతో అప్పులపాలయ్యారని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేశారని స్వామిదాసు వివరించారు. పథకాలను సద్వినియోగం చేసుకుని తమ కుటుంబాల ప్రగతికి దోహదపడాలని సూచించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్స్ విజయలక్ష్మి, వెంకటేశ్వరి, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ రేగళ్ల మోహనరెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కాలసాని విజయలక్ష్మి, తిరువూరు నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, మూడు దుర్గారావు, మోదుగు ప్రసాద్, సుందరకుమార్, పరసా సత్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా పథకాల అమలు..

చాట్రాయి: రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందజేశామని, ఓటు అడిగే హక్కు ఒక్క వైఎస్సార్ సీపీకే ఉందని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని చాట్రాయి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 1,193 మంది మహిళలకు రూ. 8.90 కోట్ల చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా, చేయూత, అమ్మ ఒడి తదితర పథకాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ పథకాలు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అందాయా అని ఆయన ప్రశ్నించారు. ఒక్కసారి గత ప్రభుత్వానికి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి గల తేడాను గమనించాలని ప్రజలను కోరారు. టీడీపీకి పోటీ చేసేందుకు ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థులు ముందుకు రావడంలేదని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపీపీ లంకా నిర్మల, వైస్ ఎంపీపీలు పుచ్చకాయల సుబ్బారెడ్డి, చల్లగుళ్ల జగన్‌మోహనరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చెలికాని బాబ్జీ, దామెర ప్రసాద్‌బాబు, కారంగుల వాసు, ఎంపీడీఓ దుర్గాప్రసాదు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



చాట్రాయి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



కొండపల్లిలో ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా తదితర పథకాలు మహిళల పేరిట అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. కొండపల్లి మున్సిపాల్టీ స్థాయి వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాల కార్యక్రమం బీ కాలనీ ఆడిటోరియంలో బుధవారం జరిగింది. 1,005 డ్వాక్రా సంఘాలకు రూ.10,37,54,648 నమూనా చెక్కును అందజేశారు. వైఎస్సార్ సీపీ మున్సిపాల్టీ పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య, సచివాలయాల కో-ఆర్డినేటర్ లంకే అంకమోహనరావు, కౌన్సిలర్ గుంజా శ్రీనివాస్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు డ్వాక్రా రుణాలు మొత్తం రద్దు చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక డ్వాక్రా సంఘాలను మోసం చేశారని విమర్శించారు. ఆయన కుట్ర రాజకీయాలతో అనేక డ్వాక్రా సంఘాలు బ్యాంకుల్లో డిఫాల్టర్లుగా మారిన విషయం మర్చిపోవద్దని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి అక్కచెల్లెమ్మలకు ఆసరా సొమ్ము నాలుగు విడతల్లో మీ అకౌంట్లకు జమచేశారన్నారు. మెప్మా ఏపీఎం దయావతి, కౌన్సిలర్ నాగ రాజకుమారి, మెప్మా రిసోర్స్‌పర్సన్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులను సమర్థంగా నిర్వహించాలి

సబ్ కలెక్టర్ సంపత్‌కుమార్



మైలవరం: ఎన్నికల విధులను సెక్టార్ అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా సబ్ కలెక్టర్ సంపత్‌కుమార్ అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల సెక్టార్ ఆఫీసర్లకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతమైన వాతావరణంలో పోలింగ్ జరిగేందుకు సెక్టార్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులు కల్పిస్తామని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఓటర్లు తమ ఓటు వినియోగించుకునేలా అప్రమత్తంగా ఉండాలన్నారు. మైలవరం నియోజకవర్గ పరిధిలోని సెక్టార్ ఆఫీసర్లు, పోలీస్ సెక్టార్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళి

ఇబ్రహీంపట్నం: ప్రజా గాయకుడు గద్దర్ జయంతి కార్యక్రమం ఏపీఎస్‌ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఎన్టీటీపీఎస్ మెయిన్ గేటు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గద్దర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ రాష్ట్ర మాజీ నాయకుడు కాంతారావు మాట్లాడుతూ గద్దర్ ఉద్యమ వీరుడిగా సమాజ శ్రేయస్సు కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. అసోసియేషన్ కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ, సామాజిక కార్యకర్త నేపా సత్యనారాయణ, జాలా విజయ్‌సన్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి అప్‌గ్రేడ్‌కు కృషి

ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయ్యేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. ఆస్పత్రిలో చేపట్టాల్సిన పలు అంశాలు, రోగులకు కల్పించాల్సిన సదుపాయాలు, జనరేటర్ కొనుగోలు, మహాప్రస్థానం వాహనం వినియోగం తదితర అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో జిల్లా ఆస్పత్రి లేనందున నూజివీడు ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా మార్చేందుకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన అనంతరం నాడు-నేడు పథకం ద్వారా ఏరియా ఆస్పత్రిని అభివృద్ధి చేయడంతో పాటు 23 మంది డాక్టర్లను నియమించామని తెలిపారు. రూ.25 కోట్లతో జీ+2 భవనాన్ని నిర్మించి కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా అన్ని వసతులు కల్పిస్తున్నామని, త్వరలోనే ఈ భవనాన్ని ప్రారంభించి రోగులకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. వైద్యులు రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. ఆస్పత్రిలో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేయాల్సి ఉందని, దీనిని ఏర్పాటు చేసేందుకు తాను గత కొన్నేళ్లుగా కృషి చేస్తున్నప్పటికీ బ్లడ్ బ్యాంకుకు అవసరమైన వైద్యుల కొరత వల్ల సాధ్యపడటం లేదన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీఆర్ మోహన్, సీనియర్ వైద్యులు ఆర్. నరేంద్రసింగ్, కమిటీ సభ్యులు బసవరాజు నగేష్, డాక్టర్ వీరభద్రరావు, వైద్యులు పాల్గొన్నారు.

బలివే దుకాణాల సముదాయానికి వేలం

ముసునూరు: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా బలివే రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో తాత్కాలిక దుకాణాల ఏర్పాటు ద్వారా రూ.13 లక్షల ఆదాయం లభించిందని ఈఓ ఆకుల కొండలరావు తెలిపారు. బుధవారం ఆలయం వద్ద కమిటీ అధ్యక్షుడు నాగుల నాగేశ్వరరావు అధ్యక్షతన వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజల సమక్షంలో దేవదాయ శాఖాధికారులు దుకాణాల సముదాయాలు, కొబ్బరిచిప్పల సేకరణకు వేలం నిర్వహించారు. దుకాణాల ఏర్పాటు హక్కు రూ. 13 లక్షలకు బలివేకు చెందిన పిల్లి రెడ్డియ్య దక్కించుకున్నారు. కొబ్బరి చిప్పల సేకరణకు ఎవరూ ధరావతు చెల్లించకపోవడంతో వేలం వాయిదా వేశారు. దీంతో గత ఏడాది కన్నా రూ.2 లక్షల, 50వేలు అధిక ఆదాయం లభించిందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, తనిఖీదారు వి.సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన పంచరత్న గానం



తిరువూరు: స్థానిక చంద్రమౌళీశ్వరాలయ ప్రాంగణంలో బుధవారం త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా పంచరత్న గానం చేశారు. త్యాగరాజ పంచకృతులను కోటి శశిశ్రీ, యడవల్లి రమాదేవి, పద్మావతి, వేదం అన్నపూర్ణ, కొల్లిపర శ్వేత, కల్యాణి, సోమయాజుల ఉషామాధురి, దేవీ నిహారికలు గానం చేశారు. నేమాని నాగలక్ష్మి భాగవతారిణి హరికథాగానం, మాడభూషి వేదాంత నరసింహాచార్యులు గాత్ర కచేరీ నిర్వహించారు. త్యాగరాజ గాన కళా సమితి కార్యదర్శి మురుకుంట్ల సీతారామలింగేశ్వరశర్మ పర్యవేక్షించారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి





మాట్లాడుతున్న వైస్ చైర్మన్ సత్యనారాయణ (ఇన్‌సెట్) సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ త్రివేణీదుర్గ

మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ

నూజివీడు: పురపాలక సంఘం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగుతూ పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అన్నారు. స్థానిక పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ త్రివేణీదుర్గ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్యం, వీధిలైట్ల నిర్వహణ, మంచినీటి సరఫరా సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్ల ద్వారా పట్టణంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం, డ్రెయినేజీల నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టణానికి రూ.16 కోట్లు మంజూరు చేసిన నేపథ్యంలో ఆ నిధులతో చేపట్టాల్సిన పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించామని తెలిపారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణంలో కుక్కలు, కోతుల బెడద అధికంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పలు అభివృద్ధి పనులకు సంబంధించి ప్రవేశపెట్టిన అజెండాలోని అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, డీఈ లక్ష్మీనారాయణ, కో-ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, లాం ప్రసాదరావు, షేక్ మెహబూబ్‌బీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విద్యా దాత ఎమ్మార్ అప్పారావు



ఎమ్మార్ అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

నూజివీడు: రాష్ట్రంలో ఎంతో మందికి విద్యాదానం చేసిన గొప్ప మహనీయుడు ఎమ్మార్ అప్పారావు అని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఎమ్మార్ అప్పారావు వర్ధంతి కార్యక్రమం ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం జరిగింది. ఎమ్మార్ అప్పారావు చిత్రపటానికి ఎమ్మెల్యే ప్రతాప్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా, రాజ్యసభ సభ్యులుగా, రాష్ట్ర మంత్రిగా ఆయన అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. వందల కోట్లు విలువ చేసే ఆస్తులను విద్యా సంస్థల ఏర్పాటుకు వితరణగా అందజేసిన గొప్ప వ్యక్తి ఎమ్మార్ అప్పారావు అని కొనియాడారు. ఎమ్మార్ అప్పారావు స్ఫూర్తితో మనందరం ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పిళ్లా చరణ్, కాలి సుగుణరావు, హరికోటి ప్రసాద్, చేబత్తిన మున్నా, ఆదపురెడ్డి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు బాణావతు రంగారావు, కొడవటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మామిడి ప్రకృతి సేద్యం విధానం భేష్

ఫ్రాన్స్ కంపెనీ ప్రతినిధి పియరీ కాస్టట్



ఆగిరిపల్లి: ఎటువంటి రసాయనాలు వాడకుండా సాగు చేస్తున్న మామిడి ప్రకృతి వ్యవసాయ విధానం చాలా బాగుందని ఫ్రాన్స్ దేశానికి చెందిన చాక్లెట్, జ్యూస్ తయారీ కంపెనీ బాయిరౌన్ ప్రతినిధి, ఫ్రాన్స్ దేశస్తుడు పియరీ కాస్టట్ అన్నారు. మండలంలోని వడ్లమానులో ప్రకృతి సేద్యం విధానంలో సాగు చేస్తున్న మామిడి రైతు రెడ్డి మహాలక్ష్మణుడు మామిడి తోటను బుధవారం ఆయన పరిశీలించారు. రసాయన మందులు వాడకుండా మామిడి తోటను ఎలా సాగు చేస్తున్నారో రైతును అడిగి తెలుసుకున్నారు. మామిడి సాగు వివరాలు, ప్రాసెసింగ్ సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, అడిషనల్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వలి, రైతులు పాల్గొన్నారు.

మండలాన్ని అభివృద్ధిపథంలో నడుపుదాం

ఎంపీపీ మెర్సీ వనజాక్షి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మెర్సీవనజాక్షి

విస్సన్నపేట: మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ మండలం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలన్నారు. పుట్రేలలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ సభ్యుడు గార్లపాటి నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. వైస్ ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు, కో -ఆప్షన్ సభ్యుడు షేక్ జాఫర్ బాబా మాట్లాడుతూ లబ్ధిదారులకు జగనన్న కాలనీ ఇళ్లు త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. డీటీ మోతీయా మాట్లాడుతూ జగనన్న కాలనీలలో ఇచ్చిన ఇళ్ల స్థలాలకు సచివాలయాలలో ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని చెప్పారు. సంబంధిత అధికారులు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, చేపట్టే పనులను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్. వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

గంపలగూడెం: ఏవిధమైన ఆటంకం లేకుండా మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు మండలంలో ప్రధాన ఫీడర్ల విభజన ప్రక్రియ చేపట్టామని విద్యుత్ ఇంజినీర్ కొమ్ము వాసు అన్నారు. గంపలగూడెం మండల పరిషత్ సమావేశం ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి అధ్యక్షతన బుధవారం జరిగింది. విద్యుత్ శాఖపై సమీక్ష సందర్భంగా వాసు మాట్లాడుతూ నాలుగు సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల విభజన ప్రక్రియ కొనసాగుతోందన్నారు. దీనిలో భాగంగా ఇళ్లకు, వ్యాపార సంస్థలకు సరఫరా చేసేందుకు నూతనంగా 11 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేసి, ఇప్పటికే అమల్లో ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్‌ను వ్యవసాయ మోటార్లకు వినియోగిస్తామని తెలిపారు. మండలంలోని 8 జగనన్న కాలనీలకు విద్యుత్ సరఫరాకు 3 కేవీ విద్యుత్ లైన్లు మంజూరయ్యాయని వివరించారు. మాతా శిశు సంరక్షణ శాఖపై సూపర్‌వైజర్ మునిలక్ష్మి, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ స్వామినాయక్, ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు మాట్లాడుతూ తమ శాఖల ప్రగతిపై సమీక్షించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మండలం ఈ ఏడాది జాబ్‌కార్డు కలిగిన కూలీలకు 6.07 లక్షల పనిదినాలు కల్పించి జిల్లాలో ప్రధాన స్థానంలో ఉందన్నారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా అధికారులు కృషి చేయాలని చెప్పారు. వ్యవసాయాధికారి బి. సాయిశ్రీ, జెడ్పీటీసీ కోట శామ్యూల్, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిని రాష్ట్రం నుంచి తరిమేద్దాం

ముసునూరు: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు చిత్తశుద్ధితో కృషి చేయాలని పీహెచ్‌సీల వైద్యాధికారులు షకీనా ఇవాంజిలిన్, కరీముల్లా పిలుపునిచ్చారు. స్పర్శ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన సదస్సులు నిర్వహించి, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఫిబ్రవరి 13 వరకు జరుగనున్న ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ స్పర్శలేని, చెమట పట్టని, నొప్పిలేని, మచ్చలుగాని, పొడలుగాని ఉంటే వైద్యాధికారులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమాల్లో వైద్య శాఖ, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో 61 మద్యం బాటిళ్లు స్వాధీనం



మీడియాతో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం: పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో అక్రమంగా మద్యం బాటిళ్లు కలిగిన నలుగురిని అదుపులోకి తీసుకున్నామని సీఐ ఎం .సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. మంగళవారం రాత్రి కొండపల్లిలో వేములకొండ సాయి వద్ద 16 మద్యం బాటిళ్లు, కేతనకొండలో పత్రి హనుమంతరావు వద్ద 15 బాటిళ్లు, బుధవారం మూలపాడు ఎస్సీ కాలనీ వద్ద ఐదుమళ్ల కొండలరావు నుంచి 15 మద్యం బాటిళ్లు, కొండపల్లి ఐడీఏలో వెన్నెల లక్ష్మీనారాయణ బడ్డీ కొట్టులో అమ్ముతున్న 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ.8,830 ఉంటుందని చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐలు పాపారావు, దామోదర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహం అభినందనీయం



రమణక్కపేట (ముసునూరు): విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న పల్లె విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని ఎంపీపీ దుర్గాభవాని అన్నారు. రమణక్కపేట హైస్కూల్‌లో హెచ్ఎం రామకృష్ణారావు అధ్యక్షతన బుధవారం ఆముదాల తిరుపతయ్య, మేరీ రత్నా వళి ఫౌండేషన్ చైర్మన్ ఆముదాల కాంతారావు ఆధ్వర్యంలో గత ఏడాది విద్యలో అత్యుత్తమ ప్రతిభ చూపిన మూడో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1,000 నగదు బహుమతులను అందించి సత్కరించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు రూ.నాలుగు వేల నగదు బహుమతులు, హాజరు శాతం అధికంగా ఉన్న చిన్నారులకు వాటర్‌బాటిల్స్‌ను అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ ఆముదాల కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా సన్మానించారు.

ఆగిరిపల్లి తహసీల్దార్, ఎంపీడీఓ బదిలీ

ఆగిరిపల్లి: సాధారణ బదిలీల్లో భాగంగా ఆగిరిపల్లి తహసీల్దార్ ఉదయభాస్కర్ కాకినాడ జిల్లాకు, ఎంపీడీఓ శంకరరావు గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.